RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 78

శనివారం 20-07-2024

పేజీలు :04 వెల:రూ. 2.00

## భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం

రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలలో లోతట్టు ప్రాంతాలుముంపుకు గురవుతున్నాయి. రాజమండ్రిలోని కంబాల చెరువు ఇన్నిసు పేట, వి ఎల్ పురం ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఏజెన్సీలోని చింతూరు మండలంలోని రెండు గ్రామాలకు రాకపోకలు నిలిపివేసారు. దేవీపట్నం గండి పోచమ్మ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. వరద ప్రభావం కారణంగా పాపికొండల టూరిజం బోట్లను నిలిపివేసారు. ధవలేశ్వరం బ్యారేజ్ వద్ద నీటి మట్టం10.60 అడుగులకు చేరుకుంది. ధవలేశ్వరం బ్యారేజ్ వద్ద నుంచి ఎప్పటికప్పుడు నీటిని ఇరిగేషన్ అధికారులు సముద్రంలోకి విడిచి పెడుతునన్నారు. ప్రతిరోజు సుమారుగా లక్ష క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు.భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గినప్పటికీ ఇక్కడ మాత్రం నీటిమట్టం పెరుగుతోంది.ముంపు పెరిగితే విలీన మండలాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశంవుంది.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# ప్రజలకు అతి భారీ వర్షాల హెచ్చరిక..



అమరావతి, జులై 19: వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడుతుంది. వచ్చే 2-3 రోజుల్లో మరింత బలపడి ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.దీని ప్రభావంతో ఇవాళ ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవహించే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం ప్రజలు చేయరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నట్లు తెలిపారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్లు క్రింద ఉండరాదని సూచించారు.మరోవైపు గురువారం సాయంత్రం 7 గంటల నాటికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 137మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. కొయ్యలగూడెంలో 111మిమీ, కోనసీమ జిల్లా

### అక్కడ పాఠశాలలకు నేడు సెలవు!

మండపేటలో 96మిమీ, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 92మిమీ, నిడదవోలులో 91మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 18 ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. 85 ప్రాంతాల్లో మోస్తారు వర్షాలు నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ హెచ్చరికలు జారీ చేశారు.బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడుతుంది. ఉత్తర బంగాళా ఖాతంలో కేంద్రికృతం కానుంది. ఈ క్రమంలో 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తరువాత వచ్చే 24గంటల్లో వాయువ్య దిశగా పయనించి ఒడిశా తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. అల్ప పీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. దీంతో నైరుతి ఋతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ రోజు ఏపీలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు, అలాగే బాపట్ల, గుంటూరు, పల్నాడు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాలోని మిగిలిన జిల్లాలు, కర్నూలు, రాయలసీమలోని నంద్యాలలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు కోస్తాలోని కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీసే ఛాన్స్ ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లోద్దని అధికారులు సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో నేడు మన్యంలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఏజెన్సీ మండలాల్లో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఐటీడీఏ పి ఓ సూర్య తేజ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఇక బెజవాడని ముసురు కామ్మేసింది. అక్కడ నిన్నటి నుండి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. రాష్ట్రంలో వర్షాలు తీవ్రంగా నమోదు కావడంతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అలెర్ట్ చేశారు. సీఎంవో అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్య సూచనలు జారీ చేశారు. పెద్దవాగుకు రెండు చోట్ల గండిపడే ప్రమాదని, ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా చూడాలని అధికారులకు సీఎం ముందస్తు ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో 15 గ్రామాలు, తెలంగాణలో 3 గ్రామాల్లో వరద నీరు చేరే ప్రమాదం ఉంది.

# అల్పపీడనంతో కలెక్టర్లతో సిఎం బాబు సమీక్ష

### అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సూచన
### సిఎం ఆదేశాలతో సిబ్బందిని అప్రమత్తం చేసిన అనిత

అమరావతి,జూలై19 : బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలపై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని నివాసంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జిల్లాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. గతంలో జరిగిన ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలతో గోదావరి కట్టలు బలహీనపడ్డాయని.. వాటిపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడే సమర్థత బయటపడుతుందని చెప్పారు. వాతావరణశాఖ హెచ్చరికలు, పరిస్థితులను అంచనా వేసి అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టాలను నివారించవచ్చని సూచించారు.సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రి అనిత అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఏలూరు,



అనకాపల్లి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు మంత్రి అనిత శ్రీవారి దర్శనం కోసం శుక్రవారం తిరుమల వెళ్లారు. అలిపిరి కాలినడక మార్గంలో కొండపైకి బయల్దేరారు.

# ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి : వైఎస్ జగన్



అమరావతి : ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ ముఖ్యమంత్రి , వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ( డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పల్నాడు జిల్లా వినుకొండ లో దారుణ హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రషీద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైసీపీ కార్యకర్తగా ఉండడం వల్లే రాజకీయ కక్షతో చంపివేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.నిందితుడిపై అనేక కేసులున్నాయని వివరించారు. హత్య వెనుక టీడీపీ పెద్దల హస్తం ఉందని వాపోయారు. తన కుమారుడితో ఎవరితోనూ పాత కక్షలు లేవని జగన్‌కు తెలిపారు. నిందితులను, వారికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ 45 రోజుల్లో రాష్ట్రమంతా అతలకుతలం అయ్యిందని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండపై వైసీపీ పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీలో వైసీపీ తరుపున వచ్చే బుధవారం ధర్నా చేస్తామని ప్రకటించారు. దాడులతో భయందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి మోసం చేస్తుందని ఆరోపించారు. అమ్మ ఒడి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీపరంగా రషీద్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని జగన్ ప్రకటించారు.

# అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

### తెలంగాణలో పలు జిల్లాల్లో భారీగా వానలు
### విశాఖ జిల్లాను వదలని వర్షాలు



హైదరాబాద్/విశాఖపట్టణం,జూలై19: తీవ్ర అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల 24 గంటల్లో ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొంది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తెలంగాణపై దీని ప్రభావం ఇవాళ, రేపు ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. విస్తారంగా వర్షాలతో పాటు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈశాన్య, తూర్పు జిల్లాలైన కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురవొచ్చు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, రామకృష్ణా థియేటర్ రోడ్డు, వెలమ వీధి, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం పాతవంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. విశాఖ ఆర్అండ్‌బీ కార్యాలయం నుంచి బిర్లా వరకు సర్వీసు రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. కార్యాలయాలు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు నడుపుతూ అవస్థలు పడ్డారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

# రాష్ట్రంలో హింస పెరిగిందని కేంద్రానికి జగన్ లేఖ.. మండిపడ్డ పురంధేశ్వరి

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి కౌంటరిచ్చారు. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన ఘోరాలపై నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఎందుకు స్పందించలేదని



నిలదీశారు. కేంద్రానికి లేఖ రాసిన వాళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.గత ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన కొనసాగిందని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. ఆ విషయాన్ని ఇంకా ప్రజలు మరిచిపోలేదని తెలిపారు. తన అక్క మీద దౌర్జన్యం చేస్తున్నారని అడిగితే 16 ఏళ్ల అమ్మాయిని కిరాతకంగా చంపేశారని.. దీనిపై స్పందించలేదని అన్నారు. ఉత్తరాంధ్రలో ఆక్సిజన్ కొరత ఉందని కరోనా సమయంలో ఓ డాక్టర్ ప్రశ్నిస్తే అతన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టారని తెలిపారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వెళ్లిన అభ్యర్థుల చేతుల్లో ఉన్న నామినేషన్ పత్రాలను చింపేశారని చెప్పారు. నెల్లూరులో కత్తులతో ఓ మహిళా కార్యకర్తను గాయపరిచారని అన్నారు. లేఖ రాయడం కాదు.. గుండెలపై చేయి వేసుకుని వైఎస్ జగన్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వం సహకారం లేనిదే ఏపీలో అభివృద్ధి సాధ్యం కాదని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. ఏపీకి కేంద్రం అన్నిరకాల సహకారం అందిస్తూనే ఉందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని, సోషల్ మీడియాలో పర్యవేక్షణ పెట్టాలని సూచించారు. గతంలో వైఎస్ జగన్ సర్కార్‌కు కేంద్ర ప్రభుత్వ సహకార నిరాకరణపై పేర్ని నాని విపులంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్రూప్-2 అభ్యర్థులకు అలర్ట్.. పరీక్ష వాయిదా..

### మళ్లీ ఎప్పుడంటే..

హైదరాబాద్ : తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.. ఆగస్టు 7, 8న జరగాల్సిన గ్రూప్-2 పరీక్షపై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది.. గ్రూప్-2 పరీక్షను డిసెంబర్‌కు వాయిదా వేసింది..డీఎస్సీ పరీక్షల కారణంగా వాయిదా వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేయడంతో గ్రూప్-2 ను తెలంగాణ ప్రభుత్వం వాయిదా వేసింది. డీఎస్సీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో గ్రూప్ 2 పరీక్షను డిసెంబర్‌కు వాయిదా వేసిన ప్రభుత్వం.. కొత్త తేదీలని త్వరలోనే ప్రకటించనుంది. గ్రూప్ ? 2లో 783 పోస్టులు ఉండగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ, గ్రూప్-2 వెంటవెంటనే ఉండటంతో వాయిదా వేయాలని అభ్యర్థులు గత కొంత కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. దీంతో రేవంత్ సర్కార్ అభ్యర్థుల వినతులకు అనుగుణంగా డిసెంబర్ నెలకు వాయిదా వేయాలని నిర్ణయం తీసుకుంది..వాస్తవానికి గత కొంతకాలం నుంచి డీఎస్సీ, గ్రూప్ 2 ఎగ్జామ్స్ వాయిదా వేయాలని డిమాండ్ చేస్తుండగా.. ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయడానికి నిరాకరించింది.. ఈ క్రమంలో ప్రభుత్వం నిన్న అభ్యర్థులతో చర్చలు జరిపింది.. పోస్టులు పెంచి ఎగ్జామ్ వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేయడంతో సానుకూలంగా స్పందించింది.మొత్తం 18 విభాగాల్లో 783 పోస్టులతో టీజీపీఎస్సీ గత ఏడాది గ్రూప్ 2 ఉద్యోగ ప్రకటన జారీచేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి 2023 జనవరి18 నుంచి ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,51,943 మంది అభ్యర్థులుఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా. ఇప్పటికే మూడు సార్లు వివిధ కారణాలతోగ్రూప్ 2వాయిదా వేశారు.. తాజాగా మరోసారి వాయిదా వేశారు.

# ఏపీలోనూ రైతుల రుణమాఫీ చేయాలి : వైఎస్ షర్మిల డిమాండ్

అమరావతి : తెలంగాణలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్ లోనూ రైతుల రుణమాఫీ చేయాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఎక్స్ ద్వారా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల తలసరి అప్పులో, దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో రైతు రుణమాఫీ ఎందుకు చేయరని ఆమె ప్రశ్నించారు.సుమారు రూ. 2,45,554 రుణం ప్రతి రాష్ట్ర రైతు నెత్తి మీద కత్తిలా వేలాడుతోందని పేర్కొన్నారు. గడచినా దశాబ్దంలో అటు కరువు, తుఫానులు, ఇటు పూర్తికాని ప్రాజెక్టులు, సర్కారుల నిర్లక్ష్యం, వెరసి రాష్ట్ర వ్యవసాయం సర్వనాశనం అయిపోయిందని ఆందోళన వ్యక్తం



చేశారు. మరి డబుల్ ఇంజిన్ సర్కారు నడుపుతున్న కూటమి సర్కార్, కేంద్ర సాయంతో ఎందుకు రుణమాఫీ చేయరని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా చేసి ఉండేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా రైతు రుణమాఫీ చేసి, చితికిపోయిన ఏపీ రైతులకు చేయూతనివ్వాలని ఆమె కోరారు. ఇది ఛాయిస్ కాకూడదు, బాధ్యత అనుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

శనివారం 20-07-2024

## పెరుగుతున్న పోషల్ మీడియా ప్రభావంతో ఈసీకి సవాలే

భారతదేశ ప్రజాస్వామ్య ప్రక్రియకు మూలస్తంభమైన లోక్‌సభ ఎన్నికలు, కఠినమైన రాజకీయ ప్రచారానికి, శక్తివంతమైన ఎన్నికల డైనమిక్స్‌కు దృశ్యకావ్యం. రాజకీయ ప్రచారంలో నైతికతను, ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం, భారత ఎన్నికల కమిషన్ ఎదుర్కుంటున్న అతి పెద్ద సవాళు. డిజిటల్ ప్రభావం పెరిగేకొద్దీ, ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడుకోవడంలో, రాజకీయ ప్రయోజనాల కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల దుర్వినియోగాన్ని అరికట్టడంలో ఎన్నికల సంఘం పాత్ర కీలకం. ప్రకటనల ఖర్చును పర్యవేక్షించడం, కంటెంట్‌ను ధృవీకరించడం, న్యాయమైన పారదర్శక ఎన్నికల వాతావరణాన్ని పెంపొందించడానికి రూపొందించిన మార్గదర్శకాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండేలా చూసుకోవడం కూడా ఇందులో భాగమే. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం దేశం సిద్ధమవుతున్న సమయంలో, సాంప్రదాయక ఆన్-ది-గ్రౌండ్ ప్రచారాలు ఇంకా డిజిటల్ వ్యూహాల ప్రభావం కొత్త ఎత్తులకు చేరుకుంది. పొలిటికల్ అడ్వర్టైజింగ్ అనేది అభ్యర్థులు ప్రజలకు చేరువ అవ్వాలని చేసే ప్రయత్నం. ముఖ్యంగా ఏమి చేయబోతున్నాం, ఎలా చేయబోతున్నాం అనే విషయాలు ప్రజలకు తెలియజేయడం ఇందులో భాగమే!! ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి సాధారణంగా ప్రకటనలను ఉపయోగిస్తారు. ముఖ్యంగా తమకే ఓటు వేయమని ఓటర్లను కోరుతూ ఉంటారు. తమకు అనుకూలమైన అంశాలను మాత్రమే కాకుండా.. ప్రత్యర్థి చేసే పనులపై వ్యతిరేకత తీసుకుని రావడానికి కూడా ప్రయత్నిస్తారు. గతంలో, రాజకీయ పార్టీ ప్రచార ప్రకటనలు న్యూస్ పేపర్ ప్రకటనలు, బిల్‌బోర్డులు, బ్రోచర్‌లు, రేడియో, టీవీ ప్రకటనలు, ఈ మెయిల్‌ల రూపంలో ఉండేవి. అయితే ఇటీవలి సంవత్సరాలలో సోషల్ మీడియాను రాజకీయ ప్రచారం కోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ప్రచారాలను నిర్వహించేందుకు బలమైన సోషల్ మీడియా బృందాలను తయారు చేసుకున్నాయి. భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద ఇంటర్నెట్ వినియోగదారులలో ఒకటి. మిలియన్ల మంది ఓటర్లతో కనెక్ట్ కావడానికి రాజకీయ పార్టీలు, సోషల్ మీడియా, ఇంకా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఎక్కువగా ఉపయోగించుకున్నాయి. ఎన్నికల ప్రచార వ్యూహాలలో, రాజకీయ కథనాలను రూపొందించడంలో, వాటిని వ్యాప్తి చేయడంలో, ఇంకా ఈ డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, ఆలోచనల-ఆదర్శాల యుద్ధభూమిగా మారుతోంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఆంధ్రప్రదేశ్ ఇంకా తెలంగాణలో రాజకీయ ప్రకటనల డేటాను, మెటా యాడ్ లైబ్రరీ నుండి సేకరించాము. మా అధ్యయనం డేటాబేస్ జాబితాలోని మొదటి 10 పేజీలపై దృష్టి సారించి, ఃఏఖ, కాంగ్రెస్, వైసీపీ అనుకూలంగా ప్రకటనలను ప్రదర్శించే అనధికారిక పేజీలను ఫిల్టర్ చేసి, ఎంగేజ్‌మెంట్ ఆధారంగా ఈ పేజీల నుండి పోస్ట్‌లను వేరు చేసి, ఒక మిలియన్ కంటే ఎక్కువ ఇంటరాక్షన్‌లు ఉన్నవాటిని శాంపిల్ చేసాము. మెటా యాడ్ లైబ్రరీ అనేది యాడ్ పారదర్శకత కోసం సమగ్రమైన, శోధించదగిన డేటాబేస్. ఖర్చుపై, రీచ్ పై ఇంకా ఫండింగ్ ఎంటిటీలతో సహా మెటా టెక్నాలజీలలో వారు చూసే ప్రకటనల గురించి వివరణాత్మక సమాచారాన్ని వినియోగదారులకు ఇది అందిస్తుంది. సామాజిక సమస్యలు, ఎన్నికలు లేదా రాజకీయాలకు సంబంధించిన ప్రకటనల అదనపు సమాచారాన్ని కూడా అందిస్తుంది, ఈ ప్రకటనలు యాక్టివ్‌గా ఉన్నా లేదా నిష్క్రియంగా ఉన్నా వాటిని ఏడేళ్ల పాటు యాడ్ లైబ్రరీలో నిల్వ చేస్తుంది. టాప్ 100 పేజీలలో ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలకు సంబంధించిన టాప్ ప్రాక్సీ పేజీల జాబితాను, వారు ఖర్చు చేసిన మొత్తం ఇంకా వాటి ర్యాంకింగ్‌లను చూడండి టాప్ ప్రాక్సీ పేజీలలో, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ఇంకా భారతీయ జనతా పార్టీకి అనుబంధంగా పేజీలను మేము గమనించాము. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీకి అనుబంధం ఉన్న టాప్ 4 ప్రాక్సీ పేజీలను, అలాగే భారతీయ జనతా పార్టీతో అనుబంధం ఉన్న ఒక ప్రాక్సీ పేజీని, ప్రకటనలు ఫేస్‌బుక్ పేజీలలోని పోస్ట్‌ల ద్వారా షేర్ అయిన కంటెంట్‌ను మేము సమగ్రంగా విశ్లేషించాము. జూఖీఅఖని రెండవ సారి అధికారంలోకి తీసుకురావడానికి ఎ-ఖంఅ సీఎం జగన్‌తో చాలా సన్నిహితంగా పనిచేసింది. ఈ సమన్వయం అన్ని ప్లాట్‌ఫారమ్‌లలో ప్రణాళికాబద్ధమైన కంటెంట్ ప్రకటన, పంపిణీపై నియంత్రణ, ఒకే రకమైన కంటెంట్ ను ప్రమోట్ చేస్తున్న తెలివైన ప్రచార వ్యూహాన్ని స్పష్టం చేస్తుంది. నాయుడుని విమర్శించడానికి, జగన్ ఎజెండాను ప్రచారం చేయడానికి ఈ ప్రకటన సృజనాత్మక అంశాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుం 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' అనేది ఫిబ్రవరి 12, 2024న క్రియేట్ చేసిన మరో పేజీ. ఈ పేజీలో అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ వ్యతిరేక ప్రకటనలే ఉన్నాయి. నరేంద్ర మోదీ, బీజేపీ పార్టీలకు మద్దతు ఇస్తూ ప్రచారం చేసే ప్రకటనల కంటే ఎక్కువ. ఃఖీూ పార్టీకి వ్యతిరేకమైన కంటెంట్‌తో కొన్ని ప్రకటనలు కూడా ఉన్నాయి. ఈ పేజీ వెబ్‌సైట్‌కి లింక్ చేశారు. ఈ వెబ్‌సైట్ ఏకైక లక్ష్యం కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఉండడమే స్వతంత్ర సంస్థల నేతృత్వంలో, ఒక పారదర్శక భాగస్వామ్య ప్రక్రియ ద్వారా, ఆన్లైన్ ప్రకటనలకై నిర్దిష్ట నియామావళిని రూపొందించాలని పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. మెటా ప్రతిస్పందన రాజకీయ పార్టీలు, వాటి ప్రాక్సీ పేజీలు మెటా యాడ్ సిస్టమ్‌ను ఎలా ఉపయోగించుకుంటాయో హైలైట్ చేస్తూ మేము మెటాని సంప్రదించాము, అలాగే ఈ సమస్యపై వారి స్పందనను కోరాము. మెటా ప్రతినిధి ఇమెయిల్ ద్వారా ఇలా ప్రత్యుత్తరం ఇచ్చారు, "మేము ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించబడిన ప్రకటనలపై చర్యలు తీసుకుంటాము.

# రైజింగ్ లో అమరావతి భూములు



విజయవాడ, జూలై 19,ఏపీలో ప్రభుత్వం మారడంతో అనుకున్నట్లుగానే అమరావతి చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటోంది. టీడీపీ అధికారంలోకి రాగానే అమరావతిని దారిలో పెట్టాలని ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. అది అయిపోగానే.. గతంలో నిర్మాణలు మధ్యలో ఆగిపోయిన భవనాల పటిష్టతపై నివేదికలు తెప్పించుకుని.. వాటి నిర్మాణాలను పునంప్రారంభించనున్నారు. అంటే ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కానీ పట్టాలెక్కడం ఖాయమన్న నమ్మకంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది . కొనుగోలుదారులు .. అమ్మకం దారులు ఎక్కువగా ఉండటంతో రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. రాజధాని గ్రామాల్లో భూముల అమ్మకాలు కకొనుగోలు ఊపందుకుంటోంది. జూన్ మొదటి వారం నుంచి క్రయవిక్రయాలు పెరగడంతో దరలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు రాక ముందు మెట్ట ప్రాంతంలో గజం రూ.20 వేలు నుంచి 25 వేలు వరకు అమ్మకాలు జరిగాయి. ఇప్పుడు రూ.35 నుంచి రూ.40 వేలకు పెరిగింది. మాగాణి భూముల్లో పోయిన సంసంవత్సరం గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.50 వేల నుంచి రూ.60 వేలకు చేరుకుంది. ఈ స్థాయిలో ధర పెరగడంతో ఇంత కాలం వేచి చూసిన వాళ్లు అమ్ముకుంటున్నారు. రిజిస్ట్రేషన్లు కూడా భారీగా పెరుగుతున్నాయి. తుళ్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గత నెలలో 280 రిజిస్ట్రేషన్లు జరిగాయ. కానీ గత పది రోజుల్లోనే 108 రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా తెలుస్తోంది. 2015లో భూసమీకరణ ద్వారా రైతుల నుంచి 34,772 ఎకరాలను తీసుకుంది. రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని ప్రకటించింది. మూడేళ్లలో రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని సిఆర్‌డిఏ చట్టంలో పేర్కొంది. టీడీపీ ప్రభుత్వం కొంత మందికి ఇచ్చింది. వైసీపీ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఐదేళ్లుగా ప్రక్రియ ముందుకు సాగలేదు. జగన్ మూడు రాజధానుల విధానం ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ పడిపోయిదం?. భూముల క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. టీడీపీ రావడంతో అమరావతికి కొత్త కళ సంతరించుకుంటుందని భావించి పలువురు రియల్టర్లు, ధనికులు, వ్యాపారవేత్తలు రాజధానిలో భూముల కొనుగోలు చేస్తున్నారు. భూములిచ్చిన రైతులు తమ ప్లాట్లను విక్రయించుకుంటున్నారు. మెట్ట ప్రాంతంలో ఎకరా భూమి ఇచ్చిన రైతుకు వెయ్యి గజాలు నివాస స్థలం, , 200 గజాలు కమర్షియల్ స్థలం ఇస్తున్నారు. రీబు భూమి ఇచ్చిన రైతులకు 1200 గజాలు నివాస స్థలం , 250 గజాలు కమర్షియల్ ల్యాండ్ కేటాయిస్తూ ప్రభుత్వం సంబంధిత పత్రాలను రిజిస్ట్రేషన్ చేసింది. మొత్తం 54 వేల ప్లాట్లు రైతులకు రిటర్నబుల్‌గా ఇచ్చింది. ప్రస్తుతం రైతులు వీటిని విక్రయిస్తున్నారు. రాజధాని సమీపంలోని పెదకూరపాడు, సత్తెనపల్లి, క్రోసూరు, అచ్చంపేట, తాడికొండ, మంగళగిరి, పెదకాకాని తదితర మండలాల్లో కూడా గత రెండు నెలల కాలంలో పొలాలకు, స్థలాలకు 50 నుంచి వంద శాతం వరకు ధరలు పెరిగాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# చిక్కుల్లో ఎంవీవీ ప్రాజెక్టులు

విశాఖపట్టణం, జూలై 19,రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు అసలు సిసలు సినిమా చూపిస్తోంది కూటమి ప్రభుత్వం. విశాఖలో ప్రముఖ రియల్టర్‌గా 30 ఏళ్లపాటు కష్టపడి నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం మనుగడే ప్రశ్నార్థకం చేస్తూ ఉచ్చు బిగిస్తోంది ప్రభుత్వం. రియలర్టగా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చిన ఎంవీవీ.. 2019లో అనూహ్యంగా విశాఖ ఎంపీగా ఎన్నికయ్యారు. రాజకీయాల్లోకి వచ్చిన రెండేళ్లలోనే వైసీపీ తరఫున విశాఖ టికెట్ దక్కించుకున్న ఎంవీవీ? ప్రస్తుత విశాఖ ఎంపీ భరత్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, మాజీ జేడీ లక్ష్మీనారాయణ వంటి ఉద్దండులను ఓడించారు. నమ్మకస్తుడైన రియలర్ట్‌గా ఆయనకున్న పేరు 2019 ఎన్నికల్లో ఎంవీవీకి బాగా పనికొచ్చిందని చెబుతుంటారు. అందుకే ఆ ఎన్నికల్లో నగరంలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ గెలిచినా, ఎంపీగా స్థానంలో ఎంవీవీ విజయం సాధించారు. ఇదంతా గతమైనా? ఆ గతంలో ఎంవీవీ వ్యవహరించిన తీరే ఇప్పుడు ఆయన వ్యాపారాలను ప్రమాదంలో పడేసిందని చెబుతున్నారు.రాష్ట్రంలోనే ఖరీదైన నగరం? పైగా అప్పటి ప్రభుత్వం పరిపాలనా రాజధానిగా చేయాలనుకున్న ప్రాంతం కావడంతో విశాఖలో రియల్ వ్యాపారాన్ని తనకు అనుకూలంగా మలచుకోవాలనుకున్నారు ఎంవీవీ? చేతిలో అధికారం ఉండటంతో విలువైన ప్రభుత్వ భూములను? వివాదాల్లో ఉన్న ప్రైవేటు స్థలాలను దక్కించుకుని రియల్ వెంచర్లు, భారీ టౌన్‌షిప్పులు నిర్మించాలని ప్లాన్ చేశారు. ఇలా ఒక్క విశాఖ నగరంలో దాదాపు 20 ప్రాజెక్టులను స్టార్ట్ చేశారు ఎంవీవీ. ఐతే తన ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి మాజీ ఎంపీపై పలు వివాదాలు, ఆరోపణలు ఉన్నాయి. ఐతే గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వమే ఉండటంతో ఆయనను ఎవరూ టచ్ చేయలేకపోయారు. ఎంపీగా ఎంవీవీ చెప్పిందే శాసనం అన్నట్లు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వ్యవహరించడంతో ఆయన ప్రాజెక్టులు చకచకా ముందుకు సాగిపోయాయి. ఐతే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆ ప్రాజెక్టులన్నీ చిక్కుల్లో పడ్డాయి.నగరంలోని ఓ పోలీసు ఉన్నతాధికారి స్థలాన్ని కాజేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న ఎంవీవీ.. కూర్మన్నపాలెంలో 11 ఎకరాల్లో చేపట్టిన భారీ హౌసింగ్ ప్రాజెక్టుపైనా కొత్తగా వివాదం మొదలైంది. ఈ ప్రాజెక్టులో భూ యజమానులకు కామన్ ఏరియాతో కలిపి కేవలం 14 వేల 400 చదరపు అడుగుల ఫ్లాట్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. 500 కోట్ల రూపాయల ప్రాజెక్టులో యజమానులకు ఇచ్చిన వాటా కేవలం 0.96% మాత్రమేనని చెబుతున్నారు. అంటే మొత్తం ప్రాజెక్టు విలువలో 99 శాతం మాజీ ఎంపీ ఎంవీవీయే కొట్టేశారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టుపై గతంలో వైసీపీ నేత విజయసాయిరెడ్డి కూడా ఆరోపణలు చేయడంతో చిక్కుల్లో పడ్డారు ఎంవీవీ?కూర్మన్నపాలెం ప్రాజెక్టే కాకుండా ఎంవీవీ, ఆయన వ్యాపార భాగస్వాములు చుట్టూ ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. తన ప్రాజెక్టు కోసం సిరిపురం రహదారిని మూసివేయ్యడం, హయగ్రీవ భూములను బలవంతంగా లాక్కోవడం, క్రిస్టియన్ సంస్థ సీబీసీఎన్‌సీ భూముల్లో అక్రమ నిర్మాణాలపైనా వివాదాలు ఎంవీవీ వ్యాపారాలకు ముప్పుగా మారాయి.వాస్తవానికి కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం నుంచే ఎంవీవీపై తిరుగుబాటు మొదలైంది. ప్రభుత్వం యాక్షన్ తీసుకోడానికి ముందే ప్రజలే స్వచ్ఛందంగా ఎంవీవీ అక్రమాలపై రోడ్డెక్కారు. ఫలితాలు విడుదలవుతున్న సమయంలోనే ఎంవీవీ మూసివేసిన రహదారిని ప్రజలే తెరిపించారు. ఈ క్రమంలోనే సిరిపురం వద్ద ఎంవీవీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ది పీక్ ప్రాజెక్ట్'ను నిలిపేయాలని స్టాప్ ఆర్డర్ జారీ చేసింది జీవీఎంసీ. ఇక ఆ భూముల్లో మైనింగ్‌కు సంబంధించి అక్రమంగా తవ్వకాలు, పేలుళ్లు చేపట్టారని మైనింగ్ శాఖ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై ఏ క్షణంలోనైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు.మొత్తానికి ప్రస్తుతం ఎంవీవీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్ని ప్రాజెక్టుల భవిష్యత్ ప్రమాదంలో పడ్డాయంటున్నారు. చాలా వాటికి అనుమతులు లేకపోవడం, కొన్నిచోట్ల నిబంధనలు అతిక్రమించడంతో వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి చేయడం కష్టమేనంటున్నారు. ఇదే జరిగితే 30 ఏళ్లుగా ఆయన నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం కుప్పకూలిపోవడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. దీన్ని గ్రహించిన మాజీ ఎంపీ ప్రభుత్వ పెద్దలను మంచి చేసేందుకు రాయబారాలు నెరుపుతున్నట్లు తెలుస్తోంది. ఐతే ఎంవీవీ కోసం ఎవరూ లాబీయింగ్ చేయొద్దని టీడీపీ అధిష్టానం తేల్చి చెప్పేయడంతో జిల్లా నేతలు కూడా చేతులెత్తేశారంటున్నారు. మొత్తానికి మాజీ ఎంవీవీ కష్టాలు ఎదుర్కోక తప్పని పరిస్థితి కనిపిస్తోందంటున్నారు.

# మహాత్మాగాంధీయే గ్రామదేవత

శ్రీకాకుళం, జూలై 19, చాలా వరకూ పల్లెటూర్లలో గ్రామ దేవతలు ఉంటారు. ఆ ఊరి ప్రజలకు ప్రధాన దైవం ఆ గ్రామ దేవతే. తర్వాతే మిగతా దేవుళ్లను కొలుస్తారు. ఇక్కడ మాత్రం గ్రామ దేవతగా మహాత్మా గాంధీ ఉన్నారు.గ్రామదేవతకు మొక్కుబడి చెల్లించుకొని ఏ శుభకార్యక్రమం అయినా ప్రారంభించడం అనవాయితీ. అందులో ఈ సీజన్లో గ్రామదేవతకు చెల్లించాల్సిన మొక్కుబడులు చెల్లిస్తే ఊరుఊరంతా ఆరోగ్యంగా ఉంటుందని వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయని నమ్మకం. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా మారవటి తర్వాత పూజలు చేస్తారు. మేళతాళాలతో ఊరు ఊరంతా కదిలి వెళ్లి అమ్మవారికి ముర్రాటలు, బోనాలు సమర్పించుకోవడానికి భాజాభజీంత్రులతో గ్రామాల్లో చేసే సందడి అంతా ఇంతా కాదు. కానీ శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కేదారిపురంలో గాంధమ్మ పేరుతో జాతిపిత మహాత్మా గాంధీని గ్రామ దేవతగా కొలవడం సాంప్రదాయం కావడంతో ఆంధ్రా ఒడిశా సరిహద్దులో ఆకట్టుకుంటుంది.గ్రామదేవత ఉత్సవం అంటే జంతు బలులు లేకుండా ఉండదు. అలాంటిది గాంధీ మహాత్ముడును కేదారిపురం గ్రామస్తుల కుల దేవుడి గ్రామదేవత కొలుస్తుండడంతో ప్రాణనష్టం లేకుండా నెయ్యిలతో చేసే పెద్ద సైజు ముద్దలను తయారు చేసి పూజిస్తారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గ్రామంలో ఈ ఆచారం కొనసాగుతోంది. ప్రతి ఏటా అషాడ మాసం ముగుస్తుందనగా గురువారం రోజున గాంధీ ఉత్సవం నిర్వహిస్తారు. పంటలు బాగా పండాలని కోరుకుంటూ మొక్కలు చెల్లించుకుంటారు. హింసను ప్రేరేపించకూడదన్న గాంధీ సిద్ధాంతాన్ని ఆచరిస్తామంటున్నారు. ఈ ఉత్సవం నిర్వహించాకే ఖరీఫ్ కి సంబంధించి వరి ఉడుపులు ప్రారంభించడం అనవాయితీ కావడం.. మహాత్మాగాంధీకి వారిచ్చే ప్రాధాన్యం అర్థమవుతుంది.అంతేకాకుండా మహాత్మ గాంధీ ప్రబోధించిన అహింసా మార్గంలోనే ఈ గ్రామదేవత పండగ కొనసాగడం మరోవిశేషం. గాంధీ ఉత్సవం రోజున పిల్లా పాపలతో ఊరు ఊరంతా కదులుతుంది. మేళతాళాలు, నృత్యాలతో గ్రామస్తులందరూ ఊరేగింపుతో గ్రామ నడిబొడ్డున మహాత్మా గాంధీ చిత్రపటాన్ని పెట్టి దాని ముందు వెదురు బుట్టలో గాంధమ్మ చెక్క బొమ్మలను పెట్టి పూజలు చేసి జాతిభక్తిని చాటుకున్నారు. అమ్మవారికి చెల్లించినట్టే ఫలాలు, ముర్రాటలు గాంధమ్మకు సమర్పించుకున్నారు. వడపప్పు, నూతన వస్త్రాలు, పానకం వంటివి నైవేద్యంగా పెట్టి దీపధూపాలతో చేసిన పూజలు చూసి గ్రామేత రులు ఫిదా అయ్యారు. గాంధమ్మా చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ కోలాటాలు, భజనలు చేసి సందడి చేశారు. కేదారిపురం గ్రామం ప్రతి ఏటా ఖరీఫ్ పనులు ఆరంభించడానికి ముందు ఊరంతా కలిసి గాంధమ్మకు పూజించి సేద్యం చేస్తే పంటలు బాగా పండుతాయని వీరి నమ్మకం. గ్రామంలో మనుషులు, పశుసంపద ఆరోగ్యంగా ఉంటుందని వీరు నమ్మకంగా చెబుతున్నారు.

## అన్ని శాఖలకు నిధుల కొరత

నెల్లూరు, జూలై 19 ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వానికి ఏడాది రెండేళ్ల వరకు ఆర్థికంగా ఒడిదుడుకులు తప్పేలా లేవు. సంపద సృష్టి అన్నది ఓవర్ నైట్‌లో సాధ్యమయ్యే పని కాదు. వాటి ఫలితాలు రావడానికి వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో ఆర్థికంగా ముందుకెళ్లడం అంత ఈజీగా కనిపించడం లేదు. ఇప్పటికే ఆయా శాఖల్లో నిధుల కొరత వేధిస్తోంది. తాజాగా మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ శాఖ ఖజానాను గత సర్కార్ పూర్తిగా ఖాళీ చేసిందని ఆరోపించారు మంత్రి నారాయణ. కనీసం వసతులు కల్పించేందుకు కూడా డబ్బులు లేవన్నారు. నిధులకోసం సీఎం చంద్రబాబును విజ్ఞప్తి చేశామని నారాయణ చెప్పారు.మరోవైపు ఇటీవల ఢిల్లీ వెళ్లిన మంత్రి సత్యకుమార్? కేంద్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్‌యాదవ్‌లను కలిసి రాష్ట్రానికి సాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. నిధుల కొరతను ఢిల్లీ పెద్దలకు వివరించారు.

## రెండు రోజుల వ్యవధిలో 30 మందిపై వీధి కుక్క దాడి.. హడలెత్తుతున్న జనం



హైదరాబాద్ : రాష్ట్రంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నిత్యం ఏదో ఓ చోట కుక్కల దాడిలో ప్రజలు గాయపడుతూనే ఉన్నారు. వీధికుక్కల దాడిలో చిన్నారులు మృత్యు వాత పడిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు చెపుతున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. చివరికి హైకోర్ట్ ప్రభుత్వాన్ని మందలించినా ఎలాంటి మార్పు కనిపించడం లేదు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో రెండు రోజుల వ్యవధిలో ఓ శునకం సుమారు 30 మందిని గాయపరిచింది.అదే కుక్క హుజూరాబాద్‌లో పారిశుద్ధ్య విధులకు వెళ్తున్న గాంధీనగర్‌కు చెందిన భాగ్య, విజయ్, సీనియర్ సానిటరీ సూపర్ వైజర్ రమేష్ పైదాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అలాగే మామిళ్లవాడలో ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను గాయ పరిచింది. కుక్కదాడిలో గాయపడినవారిని వరంగల్లోని ఎంజీఎంకు తరలించారు. కాగా, చిన్న పిల్లలు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు దాడి చేస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. దీంతో పిల్లలను బయటకు పంపించడానికే స్థానికులు వణికి పోతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి- వైరా ఏసీపీ

ఖమ్మం, జూలై 19, (న్యూస్ పల్స్) ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని వైరా ఏసీపీ రహెమాన్ తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్గాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలు కలగకుండా తక్షణమే పర్యవేక్షించి ముందస్తుఅప్రమత్త చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా డివిజన్ పరిధిలోని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, రోడ్లు, గ్రామాలు జలమయమయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని,అలాగే లోలెవల్ క్యాజువేల వద్ద ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రజలు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పోలీస్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. అధిక వర్షాల మూలంగా వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, గ్రామాల్లోని కుంటలు, చెరువులు,వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగినా, ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షం కురిసేపుడు వ్యవసాయ పనుల్లోని రైతులు, పొలాల్లో పనిచేసే కూలీలు, పుశువులు, గొర్రె కాపరులు చెట్ల క్రింద ఉండరాదని.. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షాల వల్ల ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువులు, కుంటల వద్ద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధించాలని ప్రయాణికులకు సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలమయమయ్యే ప్రాంతాలలో రోడ్డు రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా శిథిలమైన ఇళ్లు, బావుల వద్దకు వెళ్లరాదన్నారు. కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద, కరెంటు ప్రదేశాల్లోకి వెళ్లరాదన్నారు. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీస్ అధికారులకు కాని డయల్ 100కు ఫోన్‌చేయాలన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో నల్లబెల్లం పెట్టివేత.. ఇద్దరు అరెస్ట్

మహబూబ్‌నగర్ : నాటుసారా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లాన్ని) తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక నుంచి ఇద్దరు వ్యక్తులు చాల కాలంగా నాగర్ కర్నూల్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్) బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ మేరకు కర్ణాటక నుంచి వచ్చిన వాహనాన్ని నిలిపి తనిఖీలు నిర్వహించగా ఓ వాహనంలో 15 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల పటిక, నాలుగు లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. మూడు జిల్లాలకు బెల్లాన్ని సరఫరా చేస్తున్న గొల్ల రవి ఉపేంద్ర చారిలని అరెస్ట్ చేశారు. పట్టుబడిన బెల్లం విలువ సుమారు రూ.8.60లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. బెల్లం సరఫరాదారులను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీకమలహాసన్ రెడ్డి అభినందించారు.



# అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్

విజయవాడ, జూలై 19, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ లో ఆచితూచి అడుగులు వేస్తుంది. ఇటు టీడీపీ మద్దతు కేంద్రంలో అవసరం. దానిని నొప్పించకుండా అడుగు ముందుకు వేయాలి. మెప్పిస్తూనే ఒప్పించి తమ పనని పూర్తి చేసుకోవాలి. అలాగని పార్టీకి విధేయులైన వారినే ఎంపిక చేయాలి. ఇక శాసనమండలిలో ఏ ఒక్కటి ఖాళీ అయినా అది కూటమి ఖాతాలోనే పడుతుంది. స్థానిక సంస్థలు, పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానాలను పక్కన పెడితే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన ప్రతి సారీ కూటమి అభ్యర్థులే దానిని సొంతం చేసుకుంటారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఖాళీ అయినా అంతే. అన్నీ కూటమి ఖాతాలోనే పడతాయి. బలాబలాలను చూస్తే ఒక్క ఎమ్మెల్సీ పోస్టు కూడా వైసీపీకి ఈ ఐదేళ్లలో దక్కే అవకాశం లేదు భవిష్యత్ లో ఖాళీ అయ్యే పోస్టులను మిత్రపక్షాలకు కూడా పంచాల్సిన పరిస్థితి టీడీపీది. జనసేన, బీజేపీకి కూడా 29 అసెంబ్లీ స్థానాలు ఉండటంతో వాటిని కాదని చంద్రబాబు తమ అభ్యర్థులను బరిలోకి దింపరు. అదే సమయంలో ఖాళీ అవుతున్న పోస్టులలో కొన్ని జనసేనకు, మరికొన్ని బీజేపీకి విధిగా ఇవ్వాల్సి ఉంటుంది. జనసేన విషయానికి వచ్చే సరికి అది పూర్తిగా పవన్ కల్యాణ్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఆయన నిర్ణయమే ఫైనల్ కావడంతో ఆయన అనుకున్న వారికి ఎమ్మెల్సీ ఛాన్స్ దక్కుతుంది. ఇక టీడీపీ సంగతి చెప్పాల్సిన పనిలేదు. గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం కష్టపడిన నేతలతో పాటు సామాజికవర్గాల సమతూకంతో చంద్రబాబు ఎమ్మెల్సీ పదవులకు ఎంపిక చేస్తారు. వీరిద్దరి విషయంలో ఒక స్పష్టత అయితే ఉంది. ఆరెండు పార్టీల్లో ఆశావహులు కూడా ఎక్కువగానే ఉన్నారుజకానీ బీజేపీ అందుకు పూర్తి వ్యతిరేకం. కేంద్ర నాయకత్వం నిర్ణయం మేరకే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అయితే శాసనమండలి అంటే విధేయత, ట్రాక్ రికార్డును ఖచ్చితంగా చూస్తారు. ఇటీవల జరిగిన ఎన్నికల్ల నరసాపురం పార్లమెంటు సీటును శ్రీనివాసవర్మకు పార్టీని నమ్ముకున్నందుకే ఇచ్చారు. అలాగే మంత్రి పదవి విషయంలో సత్యకుమార్ పేరు ఖరారయిందంటే అది కమలం పార్టీలో ఆయనకున్న ట్రాక్ రికార్డును చూసే. మిగిలిన నేతలను పక్కన పెట్టి వీరిద్దరినీ ఎంపిక చేసిందంటే తాము పార్టీ విధేయులకు, జెండామార్చకుండా ఏళ్ల నుంచి భుజాన మోసిన నేతలకే ప్రయారిటీ ఇస్తామని కేంద్ర నాయకత్వం చెప్పకనే చెప్పింది. దీన్ని బట్టి చూస్తే బీజేపీకి భవిష్యత్ లో దక్కే ప్రతి పదవిలోనూ కూర్చుండబోయేది పార్టీలో మంచి బ్యాక్ గ్రౌండ్ ఉన్న నేతలే అని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ పరిస్థితుల్లో మాజీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ పదవి రావచ్చని అంచనాలు వినపడుతున్నాయి. ఆయన ఇటీవల రాజమండ్రి అసెంబ్లీ సీటు ఆశించినా దక్కలేదు. దీంతో ఆయన మొన్నటి ఎన్నికల్లో పోటీ చేయలేదు. పార్టీతో సుదీర్ఘ అనుబంధంతో పాటు ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ కూడా సోము వీర్రాజుకు ఉండటంతో ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశాలున్నాయంటున్నారు. అలాగే మరో నేత బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా రేసులో ఉండటం గ్యారంటీ అంటున్నారు. విష్ణు కూడా హిందూపురం పార్లమెంటు స్థానం, కదిరి అసెంబ్లీ స్థానాన్ని ఆశించారు. కానీ దక్కలేదు. వీరంతా గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. దీంతో భవిష్యత్ లో కూటమి తరుపున బీజేపీకి దక్కే ఎమ్మెల్సీ స్థానాలకు వీరిద్దరి పేర్లు ఖరారవ్వడం గ్యారంటీ అని చెబుతున్నారు. ఒకర ఉభయ గోదావరి, మరొకరు రాయలసీమ ప్రాంతం కావడంతో మరో ప్లస్ పాయింట్ అని చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందన్నది.

# నర్సాపురం ఎంపీడీవో మిస్సింగ్ కేసు

## - కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

విజయవాడ,పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న మండల వెంకటరమణ అదృశ్యమైన నేపథ్యంలో ఆయన కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను తీవ్రతరం చేశారు.ఎంపిడివో కృష్ణాజిల్లా కానూరు మండలం మహదేవపురంలో నివాసం ఉంటారు. ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటల ప్రాంతంలో తనకు మచిలీపట్నంలో ఒక ముఖ్యమైన పని ఉందని వెళ్లి వస్తానని భార్యకు చెప్పి తను వచ్చేసరికి కొంత ఆలస్యం కావచ్చని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. 15వ తేదీ అర్ధరాత్రి సమయంలో తన చిన్న కుమారుడికి వాట్సాప్ ద్వారా లెటర్ రాసిపెట్టి తనకు ఉద్యోగపరమైన ఇబ్బందులు ఉన్నాయని, అలాగే ఇతర సమస్యలు ఉన్నాయని తెలియజేస్తూ షేర్ చేశాడు. ఆ సమాచారం చూసిన వెంటనే చిన్న కుమారుడు తెల్లవారుజాము 03:00 గంటల సమయంలో పెనమలూరు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసారు.పోలీసులు వెంటనే స్పందించి ఆ తెల్లవారుజామునే ఒక బృందాన్ని మచిలీపట్నం రైల్వే స్టేషన్ కి పంపించడం జరిగింది. రైల్వే స్టేషన్ కి వెళ్లిన బృందానికి అక్కడ 15వ తారీకు మధ్యాహ్నం 02:30 నిమిషాల సమయంలో విజయవాడ వెళ్లడానికి టికెట్ తీసుకున్న రమణ రావు ను సీసీ కెమెరా ద్వారా గుర్తించడం జరిగింది. ఆ తదుపరి సీసీ కెమెరాలు ఆధారం చేసుకుని ప్రతి రైల్వే స్టేషన్ లో క్షుణ్ణంగా తనిఖీ చేసుకుంటూ సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు.ఒకవైపు సీసీ కెమెరాలను ఒక బృందం పరిశీలిస్తూ ఉండగా, మరొక బృందం ఆయన యొక్క కాల్ డీటెయిల్స్ ను, గూగుల్ మ్యాపింగ్ ను అనుసరించి మధురానగర్ వద్ద దిగడాన్ని, ఆ ప్రదేశంలో సంచరించినట్లు గుర్తించారు. తదుపరి అతని యొక్క రెండవ ఫోన్ 15-16వ తేదీ మధ్యరాత్రిలో చివరి ఆక్టివిటీ ఏలూరు కాలువ దగ్గర గుర్తించడంతో ఆయనకున్న వ్యక్తిగత కారణాలు దృష్ట్యా ఆత్మహత్య చేసుకోవచ్చేమో అనే అనుమానంతో ఏలూరు కాలువ చుట్టుపక్కల ప్రాంతాలను ఎన్డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.ఈ కేసు దర్యాప్తు,గాలింపు చర్యలు కృష్ణాజిల్లా ఎస్పీ గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో 4 డిఎస్పీలు, 4 సీఐలు 15 మంది ఎస్సైలు, 150 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.



# గోదావరిలో పెరుగుతున్న వరద



రాజమండ్రి, జూలై 19, ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలకు గోదావరిలోకి భారీగా వరదనీరు చేరుతోంది. ఈ క్రమంలోనే వరద ఉధృతి పెరుగుతుండడంతో అప్రమత్తమయ్యారు అధికారులు.. ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం పది అడుగులకు చేరింది. గత మూడు రోజులుగా 9.5 అడుగుల వద్ద నిలకడగా ఉన్న నీటిమట్టం గురువారం ఉదయం నాటికి పెరిగింది. ఇది మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇన్ఫ్లో 1.53 లక్షల క్యూసెక్కులు రాగా అవుట్ఫ్లో 1.43లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. పంటకాలువల ద్వారా 8,700 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరిలో వరద ఉధృతి పెరుగుతుండడంతో అధికారులు లంక గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద పది అడుగులుకు మించి పెరిగే అవకాశాలున్నందున సముద్రంలోకి 2లక్షల క్యూసెక్కులకు పైబడి వరద నీరు వదలాలని చూస్తున్నారు. అందుకని లంక గ్రామాల్లోకి వరద వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆయా మండల అధికారులు, గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ, పోలీసు, ఫైర్, వైద్యఆరోగ్యశాఖ, మత్స్యశాఖ, హార్టీకల్చర్, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన తూర్పుగోదావరి జిల్లా, అంబేద్కర్కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా కలెక్టర్లు వరదలు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.అఖండ గోదావరి నుంచి వరద ఉధృతి బాగా పెరుగుతుండడంతో ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద భారీగా వరద నీరు చేరుతోంది. ఇప్పటికే పది అడుగుల నీటి మట్టం స్థాయికి చేరుకున్న వరదనీరు రెండురోజుల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి దిగువకు గురువారం సాయంత్రం నాటికి 1,43,829 లక్షల క్యూసెక్కుల వరద నీరు వదలడంతో గౌతమి, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ఉరకలెత్తి క్రిందకు పారుతోంది. ఈ నదీపాయలు మొత్తం అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్కుమార్ ఇప్పటికే అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ముంపు సమస్య ఉండడంతో లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదీపాయల కరకట్టలకు సంబంధించి పటిష్టతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. గత ఏడాది వరదల సమయంలో పలు చోట్ల ఏటిగట్లు బలహీనంగా మారడంతో అక్కడ యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలుతో బలపరిచి ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది మూడుసార్లు వరదలు విరుచుకుపడడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వశిష్ట నదీపాయను ఆనుకుని రాజోలు ప్రాంతంలో ఉన్న ఎడమ కరకట ?ట చాలా బలహీనంగా ఉన్నట్లు గత ఏడాదే అధికారులు గుర్తించారు. అయితే అప్పట్లో ఇసుక బస్తాల ద్వారా గట్టును బలపరిచినా అది చాలా అదువుగా ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే పలు ప్రాంతాల్లో నదీపాయలను ఆనుకుని తవ్విన అక్రమ ఆక్వాచెరువుల వల్ల ఏటిగట్లు బాలా బలహీనంగా మారాయని, ఈ ఏడాది కూడా జిల్లాకు వరదల తాకిడి ఎక్కువ ఉండే అవకాశాలున్నందున ఎక్కడైతే కరకట్టలు బలహీనంగా ఉన్నాయో ఆప్రాంతాన్ని గుర్తించి పటిష్టపరచాలని లేకుంటే 2004లో శానపల్లిలంక వద్ద గండి పడి ఎంతటి నష్టాన్ని చవిచూశామో అటువంటి పరిస్థితులు పునరావృతం అయ్యే అవకాశాలున్నాయని లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

# నిధులండి...బాబు నిధులు...

విజయవాడ, జూలై 19,పదవుల కంటే.. నిధులే ముఖ్యం. కేంద్రంలో మన రోల్ ఏంటన్నదాని కంటే.. కేంద్రప్రభుత్వం నుంచి మనం ఏం తెచ్చుకుంటున్నామనేదే కీలకం. నవ్యాంధ్ర దేశంలోనే టాప్లో ఉండాలి. విభజన తర్వాత దెబ్బతిన్న స్టేట్ను.. దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దాలి. ఇదే ఎజెండాతో పనిచేస్తున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న చంద్రబాబు.. సెంట్రల్ గవర్నమెంట్ నుంచి పెద్దఎత్తున నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రబడ్జెట్ను ప్రవేశపెట్టే ముందు రెండువారాల వ్యవధిలోనే రెండోసారి ఢిల్లీలో పర్యటిస్తున్న చంద్రబాబు.. గత పర్యటనలోనే ప్రధాని మోదీతో పాటు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్తో భేటీ అయ్యి.. విజ్ఞప్తులు ఇచ్చారు.ఈ నెల 4, 5న ఢిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. ఏపీకి ఏం అవసరం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటి.. కేంద్రం అందించాల్సిన సాయం ఏంటనే దానిపై కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వివరించారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడాని కంటే ముందు చంద్రబాబు వరుసపెట్టి ఢిల్లీలో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇక ఇప్పటికే వైసీపీ పాలనలో ఏపీ అప్పుల పాలైందని గత ఐదేళ్లలో రాష్ట్ర అప్పులు 13లక్షల కోట్లకు పెరిగాయని చెబుతున్నారు చంద్రబాబు. ఇదే విషయాన్ని కేంద్ర పెద్దల దగ్గర ప్రస్తావించి మెరుగైన సాయం అందించాలని విజ్ఞప్తులు చేస్తోంది ఏపీ ప్రభుత్వం.స్పెషల్ స్టేటస్ కోసం ఎప్పటినుంచో అటు బీహార్, ఇటు ఏపీ డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న జేడీయూ, టీడీపీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయేలో కీలకంగాఉన్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతున్నాయి. అయితే స్పెషల్ స్టేటస్ ఇచ్చే అవకాశం లేకపోవడంతో భారీగా ఆర్థిక లబ్ది చేకూరేలా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని అటు నితీశ్కుమార్, ఇటు చంద్రబాబు కోరుతున్నట్లు తెలుస్తోంది.సీఎం చంద్రబాబు మెయిన్గా పోలవరం, అమరావతిపై ఫోకస్ పెట్టారు. పోలవరం పూర్తి చేస్తే తాగు, సాగు నీళ్లు అందించొచ్చు. అమరావతి అభివృద్ధికి అడుగులు పడితే పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే పోలవరం ప్రాజెక్టు పనుల్లో స్పీడు పెంచాలని అధికారులను ఆదేశించారు చంద్రబాబు. కేంద్రం నుంచి పోలవరం ప్రాజెక్టు పనులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని మోదీని కలిసినప్పుడు కోరారు. ఇక అమరావతి అభివృద్ధి కోసం ప్రభుత్వ భవనాల నిర్మాణం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఆర్థిక సాయం, పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే బడ్జెట్లో ఏపీకి అదనపు కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు.రోడ్లు, అండర్పాస్లు, బ్రిడ్జిలు, తాగు, సాగు నీటిప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలనేది చంద్రబాబు రిక్వెస్ట్. అంతేకాదు బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీని ఏపీకి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దుగరాజపట్నం పోర్ట్ అభివృద్ధికి సహకరించడంతో పాటు క్యాపిటల్ ఎక్స్పెండీచర్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తులు అందజేశారు.

లేటెస్ట్ హస్తిన టూర్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి.. విభజన సమస్యలు పరిష్కరించాలని కోరే అవకాశం ఉంది. ఇతర రాజకీయ అంశాలపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ 9,10లోని అంశాలు పరిష్కారం అయితే..ఆ శాఖల పేరుతో బ్యాంకుల్లో ఉన్న నిధులను వాడుకోవచ్చని భావిస్తున్నారు చంద్రబాబు.కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మొదటిసారి పెడుతున్న బడ్జెట్ ఇది. మరో వారం రోజుల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టనుంది కేంద్రం. ఈనేపథ్యంలో ఎన్డీయే సర్కార్లో కీలకంగా ఉన్న నితీశ్కుమార్, చంద్రబాబు ఇద్దరు నిధుల కోసం పట్టుబడుతున్నారు. అయితే బీజేపీ కూడా ఈ ఇద్దరు నేతల ప్రతిపాదనలను, డిమాండ్లను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. కోరినన్ని నిధులు ఇవ్వకపో యినా.. చెప్పుకోదగ్గ స్థాయిలోనే బడ్జెట్ కేటాయింపులు ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ఈసారి కాకపోయిన రాబోయే నాలుగేళ్లలో అయినా దశలవారిగా కావాల్సిన నిధులను తెచ్చుకుని ఏపీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఫిక్స్ అయింది ఏపీ సర్కార్

# నేరుగా కాలేజీలకు ఫీజు రీయింబర్స్ మెంట్

విజయవాడ, జూలై 19, ఆంధ్రప్రదేశ్లో విద్యార్థుల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకాన్ని గాడిన పెట్టేందుకు కొత్త ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల కోడ్ను సాకుతో విద్యార్థులకు గత మార్చిలో బటన్ నొక్కినా బ్యాంకు ఖాతాలకు విద్యా దీవెన డబ్బులు చేరలేదు. దీంతో ప్రతి విద్యార్థికి సగటున రూ.50వేల నుంచి లక్షన్నర వరకు ఫీజులు బకాయి ఉండిపోయాయి.పరీక్షలు రాయడానికి, కోర్సులు పూర్తైన వారు సర్టిఫికెట్లు తీసుకోడానికి కొద్ది నెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు సొంత డబ్బులు చెల్లించి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న వైనం వెలుగు చూసింది. ఫీజులు చెల్లిస్తే తప్ప పరీక్షలను అనుమతించమని కాలేజీలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు అప్పులు చేసి బకాయిలు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఫీజు రియింబర్స్మెంట్( గతంలో జగనన్న విద్యాదీవెన) పథకంపై మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు.లోపాలతో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్పై సమీక్ష నిర్వహించిన లోకేష్ కాలేజీలకు ఫీజులు నేరుగా చెల్లించేందుకు విధివిధానాలు ఖరారు చేయాలని అధికారులకు ఆదేశించారు. పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ కు విధివిధానాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గిపోవడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ విధానాన్ని అమలుచేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్నతవిద్యశాఖ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంత్రి లోకేష్ మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.విద్యాదీవెన, వసతిదీవెనకు సంబంధించి గత ప్రభుత్వం రూ. 3,480 కోట్లు బకాయిలు పెట్టడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఆయా విద్యా సంస్థల్లో నిలచిపోయాయని లోకేష్ అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో డ్రగ్స్ ను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలని అన్నారు.డ్రగ్స్పై విద్యార్థులను చైతన్యం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 3220 లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. న్యాయపరమైన చిక్కులను తొలగించి సాధ్యమైనంత త్వరగా పోస్టులను భర్తీచేసేందుకు కసరత్తు చేపట్టాలని అన్నారు.రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ఉండాలని స్పష్టం చేశారు. యూనివర్సిటీలకు సంబంధించి అకడమిక్, ఎగ్జామినేషన్ షెడ్యూలు, క్యాలండర్ తయారుచేసి, నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహణ, ఫలితాల ప్రకటనకు చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత అయిదేళ్లుగా ప్రవేశాలు తగ్గిపోవడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై సీరియస్ గా దృష్టిసారించి, అడ్మిషన్ల పెంపుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉన్నత విద్యా సంస్థల వివరాలు, మౌలిక సదుపాయాలు, అడ్మిషన్లు, కోర్టు కేసుల వివరాలు తదితర అంశాలన్నింటినీ డ్యాష్ బోర్డులో పొందుపర్చాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజులు ఏమేరకు ఉండాలి, రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల పనితీరు, అప్రెంటీస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ కు కళాశాలల ఎంపిక, రాష్ట్రంలో శ్రీ పొట్టిశ్రీరాములు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల ఏర్పాటు చేసే అంశాలపై సమావేశంలో సమీక్షించారు.మరోవైపు ఇప్పటికే అప్పులు చేసి ఫీజులు చెల్లించిన విద్యార్థులు కొత్త ప్రభుత్వం ట్యూషన్ ఫీజు బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తుందోనని విద్యార?థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. చాలా చోట్ల కాలేజీలు విద్యార్థుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేశాయి.

# హెలికాప్టర్ సాయంతో 25 మందిని రక్షించి సురక్షిత ప్రాంతానికి చేర్చిన జిల్లా యంత్రాంగం...

ఏలూరు/జంగారెడ్డిగూడెం,. జిల్లా కలెక్టర్ వారి ఆదేశములు మేరకు గురువారం ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం డివిజన్లో గురువారం కురిసిన వర్షముల కారణముగా వేలేరుపాడు మండలం లో కోడిసేల కాలువ అల్లూరి నగర్ వద్ద ఒక్కసారిగా వచ్చిన నీటి ప్రవాహములో 5 మంది కారులో చిక్కుకొనిన అల్లూరి నగర్ గ్రామస్తులు వారిని కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించడమైనదని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య తెలిపారు. జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం వద్ద చిక్కుకొనిన 11 మందిని జేసిబి సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించడమైనదన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం నారాయణపురం గ్రామములో కట్టమైసమ్మగుడి వద్ద భారీగా ప్రవహిస్తున్న వరద అవతల చిక్కుకున్న ఐదు కార్లు, నాలుగు ఆటోలు, 10 బైకులు మొత్తం 25 మందిని హెలికాప్టర్ సాయంతో రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగిందని చెప్పారు

# పీఎంగారు అపాయింట్ మెంట్ ఇవ్వండి-జగన్ లేఖ

విజయవాడ, జూలై 19, ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వం మారినప్పటి నుంచి హత్యలు, దాడులు, అకృత్యాలు పెరిగిపోయాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వైసీపీ అధ్యక్షుడు లేఖ రాశారు. పాలన కోసం వినియోగించాల్సిన అధికార యంత్రాగాన్ని ప్రత్యర్థులను వేధించడానికి వాడుతున్నారని అందులో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి యంత్రాంగాన్ని పూర్తిగా రాజకీయ వేధింపుల కోసం వాడుతున్నారని ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో నడి రోడ్డుపై ఓ యువకుడు హత్య ఉదంతాన్ని వివరించారు. ప్రజలతోపాటు అఖిల భారత సర్వీస్ ఉద్యోగులకు కూడా వేధింపులు తప్పడం లేదని ఇప్పటి వరకు దాదాపు 50 మందికిపైగా సివిల్స్ క్యాడర్ ఉద్యోగులకు పోస్టింగ్లు ఇవ్వలేదని తెలిపారు. ప్రధాని మోదీకి గురువారం రాత్రి లేఖ రాసిన జగన్ అందులో ఏం ఫిర్యాదు చేశారంటే...." ఆంధ్రప్రదేశ్లో నూతన ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి 31 మంది హత్యకు గురయ్యారు. 300 మందిపైగా వ్యక్తులపై హత్యాయత్నాలు జరిగాయి. ప్రభుత్వ వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యాయత్నం చేశారు. వెయ్యికిపైగా ప్రభుత్వం ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేశారు. ముఖ్యంగా ఊళ్లలో టీడీపీ అరాచకాలు భరించలేక పాతికవేల కుటుంబాలు ఊరు విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాయి. రోజూ జరిగే దౌర్జన్యాలు, దోపిడీలు, దాడులు సరేసరి" అని లేఖలో వివరించారు. ఆంధ్రప్రదేశ్లో వైసీపీని టార్గెట్ చేసుకొని మాత్రమే పాలన సాగుతోంది. ప్రజలకు మేలు జరిగే పాలన అందివ్వడం లేదని ఆరోపించారు జగన్. రాజకీయాల్లో వైసీపీ అనే పార్టీ ఉండకూడదనే లక్ష్యంతోనే దాడులు దుర్మార్గాలు చేస్తున్నారని విమర్శలు చేశారు. ప్రభుత్వ పెద్దల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అంతా ఏకమైన ఇదే లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాక ముందు నుంచే రెడ్బుక్ పేరుతో అధికారులను, ప్రత్యర్థులను బెదిరించారని ఇప్పుడు దాన్నేఅమలు చేస్తున్నారని ఆరోపించారు జగన్. చాలా ప్రాంతాల్లో రెడ్బుక్ హోర్డింగ్స్ పెట్టి మరీ దాడులు చేస్తున్నారని విమర్శించారు. దాడులు చేయాలని శ్రేణులకు సంకేతాలు ఇవ్వడం, అడ్డుకోవద్దని అధికారులకు సూచనలు రెండూ ఒకే సారి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఆంధ్రప్రదేశ్లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్నికల తర్వాత జరిగిన ఘర్షణలపై కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీలతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు జగన్. ఆంధ్రప్రదేశ్లో పరిస్థితులు దిగజారుతున్నాయని ఇక్కడ వాస్తవ స్థితిగతులు వివరించేందుకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని ప్రధానమంత్రిని జగన్ కోరారు. ఏపీలో రాజ్యాగబద్ధ సంస్థలు సక్రమంగా పని చేయడం లేదని ప్రజలకు రక్షమ లేకుండా పోయిందని భయానక వాతావరణం ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి నేటి వరకు వైసీపీ కార్యకర్తలతోపా ఓటు వేయని వారిపై, ఆస్తులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. వైసీపీ తరపున పోటీ చేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలకే రక్షణ లేకుండా పోయిందని వారిపై కూడా దాడులు జరుగుతున్నాయని వివరించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి నివాసం వద్ద జరిగిన ఘటనలు ప్రధానమంత్రికి వివరించారు జగన్. ఇష్టానుసారంగా రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులను అడ్డుకోవాల్సిన యంత్రాంగం నిశ్చేష్టులై ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎంపీలకే రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రజలపై దాడులు చిన్నారులపై అఘాయిత్యాలు నిత్యకృత్యమైపోతున్నాయని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో ఉన్మాదులు రెచ్చిపోయి ప్రత్యర్థులపై పగ సాధిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఏపీని విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దామని... శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కాపాడామన్నారు జగన్. ఇప్పుడు హత్యలు, మానభంగాలు, కక్షపూరిత దాడులు తప్ప ప్రజలకు జరుగుతున్న మేలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# కుటుంబంపై దాడి..వృద్ధురాలు మృతి..

## ముగ్గురికి తీవ్ర గాయాలు

తిరుపతి,తిరుపతి నగరం రాయల్ నగర్ లో జరిగిన ఘటన కలకలం రేపింది. ఒక కుటుంబంపై గుర్తు తెలియని దుండగులు కత్తితో చేసిన దాడిలో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనతో నగరం ఉలిక్కిపడింది. దుండగులు బాలికను గొంతు కోసి మరో బాలికపై, తల్లిపై కత్తులతో దాడి చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మిడియాతో మాట్లాడుతూ రాయల్ నగర్ లో మర్డర్ జరిగిన సంఘటన ప్రాంతాన్ని పరిశీలించాం. మర్డర్ కు సంబంధించి కొన్ని క్లూస్ దొరికాయన్నారు. బసవయ్య అండ్ కంపెనీ ఓనర్ శ్రీనివాసులు కుటుంబంపై దాడి చేశారని, శ్రీనివాసులు ఇంట్లో లేని సమయంలో దాడి చేసారని అన్నారు. శ్రీనివాసులు తల్లి జయలక్ష్మిపై కత్తితో అతి కిరాతకంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనివాసులు చిన్న కుమార్తె నియాతిపై కత్తితో దాడి చేశారని తెలిపారు.డ్రైవింగ్ క్లాస్ కు వెళ్ళి తిరిగి వచ్చిన శ్రీనివాసులు భార్య సురక్ష, పెద్ద కుమార్తె ప్రేరణ పైనా కత్తితో దాడి చేసి గాయపరచారన్నారు. దాడి చేసిన తర్వాత నిందితుడు బురఖా లో తప్పించుకున్నట్లు సిసి కెమెరాలో ఫుట్టేజ్ లభించాయని చెప్పారు. కుటుంబ తగాదాలే కారణమని అనుమానిస్తున్నారు. త్వరలో కేసు మిస్టరీ ఛేదించి నిందితులను అదుపులో తీసుకుంటామని ఎస్పీ అన్నారు. ఘటనపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందించారు. రాయల్ నగర్ ఘటన బాధాకరం. నిందితుడు విచక్షణారహితంగా దాడికి పాల్పడినట్లు ఘటనను చూస్తే తెలుస్తోంది.

## సీజనల్ వ్యాధులపట్ల విద్యార్థినీలు అప్రమత్తంగా ఉండండి

డోన్-శ్రీ ప్రస్థానం:-వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థినీలు అప్రమత్తంగా ఉండాలని చిన్న మల్కాపురం వైద్యాధికారి చెన్నకేశవులు సూచించారు. శుక్రవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో డోన్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల కళాశాలలో దాదాపు 630 మంది విద్యార్థినీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చెన్న కేశవులు మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశు భ్రత పాటించడం వల్ల రోగాలు దరిచేరవన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తోపాటు సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినిలకు వివరించారు. అనంతరం పాఠశాల, వసతి గృహం పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ప్రభాకర్, ఎంపీహెచ్ఎస్ విజయలక్ష్మి, చిన్న మల్కాపురం పిహెచ్ సి సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్ర్రాల ను సద్విని యోగం చేసుకోవాలి

**..మండల ఎంపీడీఓ. శ్రీని వాసులు.**

దొర్నిపాడు, ఫిబ్రవరి: 19, శ్రీ ప్రస్థానం న్యూస్:- ఈ నెల 23నుంచి 27 వరకు మండలంలోని అయా గ్రామ సచివాలయాల్లో నిర్వహించే మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్విని యోగం చేసుకోవాలనీ ఎంపీడీఓ. శ్రీని వాసులు,శుక్ర వారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జివిడబ్ల్యువి మరియు విఎస్డబ్ల్యుఎస్. శాఖ విజయవాడ వారి వారి ఆదేశాల మేరకు మండలం లోని వివిధ గ్రామాల్లో ఐదు రోజుల పాటు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు..23 న దొర్నిపాడు-1, ఉమాపతి నగరం,24 న దొర్ని పాడు -2, ఉమా పతి నగర్,25 న కొండా పురం,గుండు పాపుల 26 న బుర్రా రెడ్డి పల్లె, డబ్ల్యు.గోవిందిన్నే , 27 న చాక రాజు వేముల,డబ్ల్యు. కొత్త పల్లె, గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు.. డిజిటల్ అసిస్టెంట్,లు యస్. నాగేశ్వర రావు,టి. సౌజన్య ,లు ఆధార్ కార్డు లో మొబైల్ ఫోన్ లింక్, పేర్లు,మార్పులు చేర్పులను చేతీస్తారని ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కోరారు...

## పంచాయతీ కార్యదర్శులు సమయ బావాన్ని తప్పక పాటించాలి.

**ఈ ఓ పి ఆర్ డి.రికార్డులను పరిశీలిస్తున్న ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాస శర్మ.**



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ సమయ బావాన్ని తప్పక పాటించాలని ఈవో పి ఆర్ డి శ్రీనివాస శర్మ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మందలూరు గ్రామ పంచాయతీ రికార్డులను వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ రికార్డులు పగడ్బందీగా నిర్వహించి ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎప్పటికప్పుడు ఎంట్రీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఓబులేసు, మౌనిక తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బడ్జెట్ పై ఏపీ ఆశలు

విజయవాడ, జూలై 19, (న్యూస్ పల్స్)మరో 3 రోజులు మాత్రమే గడువు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అసలు సిసలు పరీక్ష. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత చంద్రబాబు కేంద్రంలో బీజేపీకి వచ్చిన మెజారిటీ సంఖ్యను చూసి చాలా ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే కేంద్రం నుంచి సహాయ సహకారాలు అవసరం. అయితే చంద్రబాబు మద్దతు అవసరం కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఉంది. దీంతో ఆయన అనుకున్నది అనుకున్నట్లు వర్క్ అవుట్ అవుతుందని అంచనా వేసుకుంటూ కొంత ముందుకు వెళుతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నా, అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి కావాలన్నా అప్పులు చేసి చేయడం కుదరదు.. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అవసరం అవుతుంది. అది ఏ స్థాయిలో అంటే వేల కోట్ల రూపాయలు రెండు ప్రధాన ప్రాజెక్టులకు అవసరమవుతాయి. అప్పుడే అమరావతి, పోలవరం ప్రాజెక్టులు పూర్తవుతాయి. భవనాలను నిర్మించాలన్నా, ప్రాజెక్టు పూర్తి చేయాలంటే నిర్వాసితులకు పరిహారం దగ్గర నుంచి అనేక సమస్యలు చంద్రబాబు గడప ముందే వెయిట్ చేస్తున్నాయి. వీటన్నింటినీ దాటుకుని ముందుకు వెళ్లాలంటే మోదీ ప్రభుత్వం నుంచి భారీ స్థాయిలో రాష్ట్రానికి నిధులు చేరాల్సిన అవసరం ఉంది. అందుకే చంద్రబాబు రెండోసారి ఢిల్లీ వెళ్లి కేవలం కీలకనేత అయిన అమిత్ షాను కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించి వచ్చారు. ఈ నెల 23వ తేదీన కేంద్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ పై చంద్రబాబు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గడచిన పదేళ్లలో కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ప్రత్యేకంగా మోదీ ప్రభుత్వం కేటాయింపులు జరిపింది దాదాపు శూన్యమనే చెప్పాలి. జగన్ తన ఐదేళ్లలో నిధుల విషయాన్ని పెద్దగా ప్రస్తావించకపోయినా సంక్షేమ పథకాలకు సంబంధించి అప్పులకు అనుమతులు తీసుకుంటూ నెట్టుకొచ్చారు.

# ఆ కథనాల్లో వాస్తవం లేదు...

**భూ బకాసురులకు వత్తాసు పలికింది రెవెన్యూ అధికారులే...**
**బాధితుడుగాజుల బాషా వెల్లడి.**

నంద్యాల జూలై 19: నంద్యాల పట్టణంలోని విలువైన భూముల అన్యాక్రాంతంపై ఒక పత్రికలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని భూముల సంబంధించిన బాధితుడుగాజుల బాషా శుక్రవారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. తమ పెద్దల ఆస్తిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసిన భూకబ్జాదారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. పేద ముస్లిం వర్గాలకు చెందిన విలువైన స్థలాలను నంద్యాల పట్టణంలో ఆర్థికంగా బలం ఉన్న ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వివిధ ప్రాంతాల్లోని విలువైన భూములను కబ్జా చేశారని విమర్శించారు. డబ్బు, అధికార బలంతో రెవెన్యూ అధికారులను తమ బుట్టలో వేసుకున్న ఈ వర్గం పెద్దలు అదే సామాజిక వర్గానికి చెందిన పాత్రికేయులతో తప్పుడు కథనాలు పత్రికలో రాయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు.18-09-2021 వ తేదినతాను స్థానిక నంద్యాల మండలం మూలసాగరం గ్రామ పంచాయతీ కి చెందిన సర్వే నినీ 738/2=0.18 సెంట్లు 738/3=0.10 సెంట్లు మరియు 739/2=0.53 సెంట్లు వెరసి 0.81 సెంట్లు అన్యాక్రాంతం గూర్చి తహసీల్దార్ కి అర్జీ పెట్టుకున్నారన్నారు. అప్పటి ఎతీనీ రవికుమార్ నిష్పాక్షపాతంగా మూడు నోటీసు లతో విచారణ జరిపిన విధానం నచ్చని అక్రమ భుబకాసురులు అప్పటి వైకాపా అధినేత సహాయం తో ఎతీనీ ను ట్రాన్స్ఫర్ చేసారనీ ,ఇక వారి స్థానంలో వచ్చిన ఎతీనీ శ్రీనివాసులు, ఆ రమాదేవి భూ బకాసురుల డబ్బుల ఆశకు లోనై రెవెన్యూ చట్టానికి విరుద్ధంగా ఇంటి స్థలాలుగా ఉన్న 738 లోని 0.28 సెంట్ల విలువైన స్థలాన్ని రాత్రికి రాత్రి మ్యూ టేషన్ కట్టించి భవనాషి వాసు పేరున ఆన్లైన్ లో నమోదు చేసారన్నారు.ఇక 739/2 =0.53 సెంట్లు ఇప్పటికి కూడా గాజుల ఖాసీం సాహెబ్ పేరుతో డాక్యుమెంట్ విక్రయించ కుండా ఉన్నప్పటికీ, లేని బబీఎ డివిజన్ 739/3 వేసి దొంగ రిజిస్టర్ చేసుకొన్నారని తెలిపారు. ఈ విషయాన్నీ విచారణ లో తెలుసుకొని రిపోర్ట్ ఇవ్వాల్సిన ఎతీనీ సివిల్ కోర్ట్ కు రెఫెర్ చేసే విధంగా ఆర్డర్ ను ఈ భూ బకాసురులు ఇప్పించుకున్నారు. పేద వాడినైనా తమబాధిత కుటుంబం కోర్ట్ కు వెళ్ళ లేక జరిగిన అన్నాయాన్ని కలెక్టర్ కు మొ ర పెట్టుకున్నా మని తెలిపారు.ఈ విషయాన్నీ సీరియస్ గా తీసుకున్న జాయింట్ కలెక్టర్ ఆ ని ప్రస్తుత తహసీల్దార్ ను వివరణ కోరగా ఆ ఇందులో తన ప్రమేయం ఏమి లేదు అంత ఎతీనీ గారి ద్వారా ఈ తతంగం జరిగిందని, అందులో తన సంతకం కూడా లేదని సరియైన సమాధానం చెప్పలేక బుకాయించినట్లు తెలిసిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు బాధితుడు పెట్టుకున్న అర్జీ లో ఎక్కడ కూడా వారి మరో సర్వే నినీ 428 పైకి ఒక ఎకరా అన్యాక్రాంతం గూర్చి అభ్యంతరం తెలపనప్పటికి అత్యుత్సాహంతో 428 పై కూడా విచారణ చేసి నట్టు, అందులో కూడా బాధితుడు కోర్ట్ కు వెళ్ళమని సూచించడం జరిగిందనీ ,దీనిని బట్టిచూస్తే ఏ స్థాయిలో తహసీల్దార్ మరియు ఆ ఇందులో ఇన్వాల్వ్ అయ్యి ఈ భూబకాసురులకు వత్తాసు పలికారో అర్థం చేసుకోవచ్చునీఅన్నారు.ఐఏఎస్ స్థాయి అధికారి రంగంలో దిగినప్పటికి అయనపై కూడా వివిధ రకాలుగా ఒత్తిడి తెచ్చి, బయట వివిధ రకాలుగా పుకార్లు పుట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాల ప్రజలు ఆర్థిక అండబలంతో భూములను కబ్జా చేస్తున్న ఆ వర్గం ప్రజలకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పట్టణంలోని పేద ప్రజల భూములు కబ్జా చేస్తున్న ఈ వర్గం పెద్దలపై కఠిన చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదుదారుడుగాజుల బాషా విజ్ఞప్తి చేశారు.

## మౌలిక సదుపాయాలు కల్పించి టిడ్కో గృహాలు అందిస్తాం..

**రాష్ట్ర మంత్రి టి.జి భరత్..పేదలకు నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.. మంత్రి భరత్..**
**జగన్నాథగట్టుపై రూ.1.38 కోట్లతో మహిళా మార్ట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి**

కర్నూలు జూలై 19:- పేదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మించిన టిడ్కో ఇళ్లు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి పేదలకు అందజేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. పేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతోనే గతంలో



టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నగర శివార్లలోని జగన్నాథ గట్టు పై కర్నూలు నగరపాలక సంస్థ పి యం ఏ వై(అర్బన్) టీడ్కో కాలనీ నందు రూ. 1.38 కోట్లతో నిర్మించనున్న మహిళా మార్ట్ నిర్మాణానికి మంత్రి టి.జి. భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు నివాసాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా టీడ్కో గృహ నిర్మాణాలు చేపట్టిందన్నారు. అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం మిగిలిన నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. కేవలం చంద్రబాబు నాయుడుకు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం రంగులు వేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. టిడ్కో గృహాల కోసం లబ్ధిదారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. చివరి దశలో ఉన్న ఈ గృహాలను త్వరలో అన్ని మౌలిక వసతులతో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటి పర్యటన చేపట్టినపుడు చాలామంది లబ్ధిదారులు టిడ్కో గృహాల విషయంలో చాలా సమస్యలు తనకు తెలిపారన్నారు. వీటన్నింటినీ తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మహిళా మార్ట్ ద్వారా టిడ్కో నివాసితులకు రీజనబుల్ ధరలకే సరుకులు లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు నగరానికి తలమానికముల ఈ గృహాలను ఏర్పాటు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి దేఅని అన్నారు. మన ముఖ్యమంత్రి మహిళల పక్షపాతి అని ఈరోజు మహిళల కొరకు మార్ట్ లను ఏర్పాటు చేపిస్తున్నారని అందులో భాగంగానే ఇక్కడ మహిళా మార్ట్ కు శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఈ గృహాలలో ప్రస్తుతం 50 కుటుంబాలు నివాసం నివాసం ఉన్నాయని. వీరికి మౌలిక వసతులు కూడా కల్పించామని, గృహాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ప్రస్తుతం నీటి సౌకర్యాలు కూడా కల్పించామన్నారు. నివాసితుల కొరకు త్వరలో మహిళా మార్ట్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామని అందుకుగాను ఈరోజు శంకుస్థాపన కార్యక్రమం కూడా మంత్రివర్యుల చేతుల మీదుగా చేయడం జరిగిందన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గృహాలకు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు త్వరలో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. మన ప్రభుత్వం మహిళా పక్షపాతిఅని ఇందుకు ఉదాహరణ ఓర్వకల్లులోని మహిళలే అని ఎమ్మెల్యే అన్నారు. ఓర్వకల్లులోని మహిళా గ్రూపు జిల్లాలో, రాష్ట్రాలలోనే కాకుండా విదేశాల్లో కూడా గుర్తింపు తెచ్చారని ఎమ్మెల్యే అన్నారు. కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం ఈ గృహాలను సర్వ సుందరంగా తీర్చిదిద్ది మౌలిక వసతులను త్వరలో కల్పించి లబ్ధిదారులకు ఇవ్వనున్నారని ఎమ్మెల్యే అన్నారు. అంతకుముందు మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు టిడ్కో గృహాలను పరిశీలించారు.

## మైక్రోసాఫ్ట్‌తో సంప్రదించాం.. సర్వర్ల అంతరాయంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్




న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గం మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్ంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. విమానాలు మొదలు బ్యాంక్‌లు, స్టాక్ మార్కెట్స్, సూపర్ మార్కెట్స్ వరకు పలు రంగాలకు అంతరాయం కలిగింది.ప్రపంచవ్యాప్తంగా చాలా మంది విండోస్ యూజర్లు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ అనే ఎర్రర్ సమస్యను ఎదుర్కొంటున్నారు.కాగా మైక్రోసాఫ్ట్ సర్వర్ అంతరాయం కారణంగా భారత్‌లోనూ పలు రంగాలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో ఏర్పడ్డ అంతరాయాన్ని పరిష్కరించేందుకు భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మైక్రోసాఫ్ట్‌తో సంప్రదింపులు జరుపుతోంది. ఈ అంతరాయానికి కారణం ఏంటో గుర్తించారు. సమస్య పరిష్కారానికి కూడా ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి తెలిపారు. అలాగే సమస్య పరిష్కారానికి కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (అఇఖీ) మైక్రోసాఫ్ట్‌కు పలు కీలక సూచనలు చేసినట్లు మంత్రి ఎక్స్ వేదికగా ప్రకటించారు.అలాగే ఈ అంతరాయం నేషనల్ ఇన్ఫార్మాటిక్స్ సెంటర్‌పై (ఔఎఅ) ఎలాంటి ప్రభావం చూపలేదని మంత్రి పేర్కొన్నారు. ఎన్ఐసీ అనేది ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఎఱ) నెట్‌వర్క్, ఇది కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాలకు సేవలను అందించే కమ్యూనికేషన్ నెట్‌వర్క్. దీనిపై ఎలాంటి ప్రభావం పడలేదు. దీంతో భారత్‌లో ప్రభుత్వ కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేనట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే భారత దేశంలో విస్తారా, ఇండిగో, స్పైస్‌జెట్, అకాసా వంటి విమానాయన సంస్థలపై ఈ అంతరాయం తీవ్ర ప్రభావం చూపుతోంది. చెన్ ఇన్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. విమానయాన సంస్థలు ప్రస్తుతం ప్రయాణికులకు మాన్యువల్‌గానే టికెట్లను జారీ చేస్తున్నాయి. కాగా అంతరాయంపై మైక్రోసాఫ్ట్ సైతం అధికారికంగా ప్రకటించింది. నిరంతరం సేవలను మెరుగుపరుస్తున్నామని మైక్రోసాఫ్ట్ తెలిపింది. సమస్యను సరిదిద్దేందుకు అనేక బృందాలు పని చేస్తున్నాయని, ఇందుకు గల కారణాలను తెలుసుకుంటున్నామని తెలిపింది.

## పెద్దిరెడ్డీ బుద్ధి తెచ్చుకో..

**కొడాలి నాని ఒక వెధవ**
**టిడిపి నేత బుద్దా వెంకన్న**

విజయవాడ చంద్రబాబు పుంగనూరు వస్తే ఆయనపై దాడులు చేయించారు. దమ్ముగా, ధైర్యం గా ఎదుర్కొన్న వ్యక్తి చంద్రబాబు. ప్రజల కోసం పని చేసే మా నాయకుడికి భయం లేదని టీడీపీ నేత బుద్ధా వెంకన్న అన్నారు.దోచుకున్న మీకు భయం కాబట్టే... పారిపోతున్నారు. నిన్న మిమ్మలను అడగడానికి వస్తే మిథున్ రెడ్డి రాళ్ల దాడి చేయించాడు. జగన్ కు, నీకు డబ్బు మీద అంత వ్యామోహం ఎందుకు. పెద్దిరెడ్డి కుటుంబానికి దోచుకోమని మైనింగ్ అప్పగించాడు. దొంగ చేతికి తాళ్లం ఇచ్చారు కాబట్టే ప్రజల సంపద దోచేశారు. పెద్దిరెడ్డి వేల కోట్లు అక్రమంగా కూడేశాడు. అధికారం, ధన ప్రభావం తో విర్రవీగారు. మీ అరాచకాలు చూడలేకే ప్రజలు తిరగ పడుతున్నారు. డబ్బు మదంతో అబ్బా కొడుకులు దాడులు చేయిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఓడించడానికి డబ్బులు వెదజల్లారు. అయినా ప్రజలు అబ్బా కొడుకుల కుట్రను తిప్పి కొట్టారు. నిన్న మిథున్ రెడ్డి చేసిన నిర్వాకం ప్రజలు చూశారు. మీ వైసిపి కార్యకర్తలే నీకు అండగా నిలవలేదు. అబ్బా కొడుకుల అవినీతి తో ఆ పార్టీ వాళ్లే ఆశ్చర్యపోయారు. మీ నియోజకవర్గం లో ప్రజలే మిమ్మపను ఛీ కొడుతున్నారు. వెయ్యి తరాలు తిన్నా... తరగని సంపద పెద్దిరెడ్డి దోచుకున్నారు. నిన్న పుంగనూరు ప్రజలు మిథున్ రెడ్డి ని ఛీ కొట్టారు. మైనింగ్ గనుల ప్రజలు కు అప్పగించండని అన్నారు.చంద్రబాబు దాడి చేయించారని చెప్పడం సిగ్గు చేటు. నిజంగా మేము తలచుకుంటే మీరు ఇలా తిరుగుతారా. మా నాయకుడు సంయమనంతో ఉండాలని చెప్పారు కాబట్టి సైలెంట్ గా ఉన్నాం. లోకేష్ రెడ్ బుక్ పేరు చెబితేనే భయ పడుతున్నారు. ఆ బుక్ లోపేర్లు ప్రకటిస్తే ..ఇక మీ పరిస్థితి ఏమిటి. ఇప్పుడు అయినా పెద్దిరెడ్డి బుద్ధి తెచ్చుకో. కొడాలి నాని ఒక వెధవ... వాడు లాక్కున్న థియేటర్ అసలు యజమానులకు అప్పగించారని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బెజ్జిపురం గ్రామ సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్ ప్రమాదం జరిగింది. ఒక ఆర్టీసీ బస్సు లారీను వెనుక నుండి వచ్చి ఢీకొంది.ఘటనలో పలువురికి తీవ్రగాయాలుఅయ్యాయి. ఎచ్చెర్ల బిజేపి శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ఘటనా స్థలంకు చేరుకుని క్షతగాత్రులను దగ్గరుండి ఆసుపత్రికు పంపించారు

## బాలిక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రులు

నంద్యాల నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి బాలిక కుటుంబాన్ని మంత్రులు పరామర్శించిన ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు.మీడియాతో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ బాలిక కుటుంబానికి టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులు ఎంత వారైనా వదిలిపెట్టేది లేదని కచ్చితంగా వారిని శిక్షిస్తామన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున 10 లక్షల చెక్కును,ఇంటి నిర్మాణం కొరకు టిడిపి ప్రభుత్వం నుంచి సహాయం చేస్తా మన్నారు. అనంతరం బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బాలికా అత్యాచారం హత్య కేసులో ఎంతటి వారినైనా వదిలేది లేదు అని గత ప్రభుత్వం చేసిన విధానాల వల్ల గంజాయి అలవాటు పడి ఇలాంటి అగైత్యాలకు పాల్పడుతున్నారు అని మృతదేహం కనపడకపోవడం హృదయాన్ని కలిసి వేస్తుంది అన్నారు. బాలిక కేసులో ఇంతటి వారినైనా వదిలేదే లేదు సరైన శిక్ష పడే తీరుతుంది అని అన్నారు.ఊరికి పక్కనే కృష్ణా నది రిజర్వాయర్లు ఉండడం వలన అమ్మాయి మృతదేహం దొరికేంతవరకు గాలింపు చర్యలు కొనసాగిస్తామన్నారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

## ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు.

కర్నూలు, స్పోర్ట్స్ న్యూస్: జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలకు అనుగుణంగా కర్నులు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు , డి. ఎస్. ఏ. సిబ్బందితో ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం గూడూరులో ఉన్న కే.వి.కె స్టేడియం లో ఉన్నటువంటి అద్దె షాపులు తనిఖీ చేయడం జరిగినది. షాపు రెంట్లు బకాయిలు గురించి విచారించి భవిష్యత్తులో ఇకపై బకాయిలు పెట్టవద్దని ఆగ్రహం వ్యక్తపరిచారు. అక్కడ ఉన్న సిబ్బందికి కూడా ప్రతి నెల తప్పకుండా అద్దెలను వసూలు చేయమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు ఆదేశించారు. ఈయన వెంట వాలీబాల్ కోచ్ రవి, ఫెన్సింగ్ కోచ్ మహేశ్వరరావు, అథ్లెటిక్స్ కోచ్ కాశీ రావు శేఖర్ పాల్గొన్నారు.

## శ్రీ కపిలేశ్వరాలయంలో వేడుకగా పవిత్ర సమర్పణ

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం వేడుకగా గ్రంథి పవిత్ర సమర్పణ జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 11 గంటల వరకు యాగశాల పూజ, హోమం, లఘు పూర్ణాహుతి, గ్రంథి పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు యాగశాలపూజ, హోమం, పట్టు పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ దేవేంద్రబాబు, ఏఈఓ శ్రీ సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీ కృష్ణ వర్మ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## జూలై 21న పౌర్ణమి గరుడసేవ

గురు పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 21న ఆదివారం గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షిస్తారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757